క్లుప్తంగా

26న ఉచిత మెగా వైద్య శిబిరం

రాజంపేట రూరల్: ఈ నెల 26న ఉచిత మెగా వైద్య శిబిరం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండల పరిధిలోని కె.బోయనపల్లెలో గల శాన్వి ఇంటర్‌నేషనల్ స్కూల్ ఆవరణలో రాష్ట్రీయ క్షత్రియ సేవాసంఘం, తిరుపతి, ఫెడరేషన్ ఆఫ్ క్షత్రియ సేవా సంఘం హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పుల్లంపేట: మండల విద్యాశాఖ అధికారి రంగనాథయ్య మంగళవారం సీతారాంపేట ప్రాథమిక పాఠశాల, అనంతంపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని హెచ్చరించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రతిరోజూ మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల హెచ్ఎంలు పరిశీలించాలని కోరారు.

సచివాలయం తనిఖీ

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో గల సచివాలయాన్ని మంగళవారం అనంతపురం ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ శాఖల వివరాలు, ప్రజలకు ప్రభుత్వ సేవలు ఎలా అందుతున్నాయి అనే దానిపై వివరాలు తెలుసుకున్నారు. ఈయన వెంట ఒంటిమిట్ట వీఆర్‌వో ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

ఫారెస్ట్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

చిన్నమండెం : దళితుడైన పెద్దగంగయ్యను అసభ్య పదజాలంతో మాట్లాడటమే కాకుండా కేసు నమోదు చేసి జైలుకు పంపుతానంటూ బెదిరింపులకు పాల్పడిన ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రఘుశంకర్‌పై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్‌కు ఆయన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షులు పండరయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్ దగ్ధం

ఓబులవారిపల్లె: గాదెల వెంకటాపురం గ్రామంలో సోమవారం రాత్రి గ్రామానికి చెందిన న్యాయవాది జి శ్రీనివాసులు స్కూటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించి దగ్ధం చేశారు. రాత్రి సమయంలో గ్రామ సమీపంలోని తమ రైస్ మిల్లు వద్ద హీరో ఫ్యాషన్ ప్రో బైక్ బయట ప్రాంతంలో తాళం వేసి ఉంచామని, మంగళవారం ఉదయాన్నే చూసే సరికి స్కూటర్ దగ్ధమైందని, ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రామచంద్రయ్య గౌడ్ తెలిపారు.


క్రీడా సామగ్రి వితరణ

పెనగలూరు: మండలంలోని అత్యంత మారుమూల కొండ ప్రాంతమైన మల్లాలమ్మ దిన్నె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్సిళ్ళు, పెన్నులు, క్రీడా సామాగ్రిని అందజేశారు. కట్టవారిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోపాల కృష్ణ విద్యార్థులకు సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, నిరక్షరాస్యులైన గ్రామస్తులకు చదువు ప్రాముఖ్యత గురించి వివరించారు. మారుమూల గ్రామమైనా ప్రతి పిల్లవాడిని పాఠశాలకు పంపాలని, ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు విద్యార్థులకు కల్పిస్తోందని తెలియజేశారు. పాఠశాలకు పంపే విద్యార్థులకు మంచి పౌష్టిక ఆహారం కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పీఈటీ జయలక్ష్మీ, ఉపాధ్యాయుడు పెంచలయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేదిక మరమ్మతులకు చేయూత

సంబేపల్లె : మండల పరిధిలో శ్రీ దేవరరాయి ఆలయం సమీపంలో వేదిక ఏర్పాటు చేశారు. ఈ వేదికకు పూతలు, ఫ్లోరింగ్ లేకపోవడంతో వాటి మరమ్మతుల నిమిత్తం మంగళవారం దాత గిరీష్‌రెడ్డి ఆర్థిక సహాయం చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే మొలకలపౌర్ణమికి గంగమ్మ జాతర జరుగుతుందని, అందువలన ఇప్పటి నుంచే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఏఐటీఎస్ అధ్యాపకుడికి డాక్టరేట్


తిరుమలయ్య

రాజంపేట : ఏఐటీఎస్‌లో సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్న గుర్రం తిరుమలయ్యకు డాక్టరేట్ లభించింది. ఈ విషయాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కోయంబత్తూరులోని కారుణ్య డీమ్డ్ యూనివర్సిటీ వారిచే ఈ డాక్టరేట్‌ను అందుకున్నారని వివరించారు. ఆబ్జక్ట్ డిటక్షన్ బేస్ట్ వీడియో సినాప్సిస్ ఫర్ కంప్యూటర్ విజన్ అప్లికేషన్స్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ డాక్టరేట్ ఇచ్చారన్నారు. ఈయనను ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డిలు అభినందించారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- పట్టణ గృహ సారథుల మీట్‌లో ఎమ్మెల్యే మేడా
- జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలి – ఆకేపాటి


మా నమ్మకం నువ్వే జగన్ కిట్‌ను అందచేస్తున్న ఎమ్మెల్యే మేడా, జడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపాలిటి చైర్మన్ పోలా

రాజంపేట: ప్రతిపక్షాలకు బుద్ధివచ్చేలా ప్రజలకు న్యాయం చేయాలి.. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి అని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి పిలుపునిచ్చారు. ఎన్‌వీఆర్ కళ్యాణ మండపంలో పట్టణ గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, పరిశీలకుడు కృష్ణమూర్తితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడా మాట్లాడుతూ గృహసారథులు, వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందచేసే విషయంలో ఎవరికీ భయపడనవసరంలేదన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధుల్లాంటి వారు వలంటీర్లు, గృహసారథులన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం లక్ష్యాలను, ఉద్దేశ్యాలను వివరించారు. జడ్పీచైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ మనలో మనకు విభేదాలు, మనస్పర్ధలు ఉండవన్నారు. మనందరం వైఎస్సార్ కుటుంబమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకునేలా ఇప్పటి నుంచే కృషిచేయాలన్నారు. మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు చేపట్టిన కార్యక్రమం విజయవంతమయ్యేలా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కృషిచేయాలన్నారు. పరిశీలకుడు కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వంపై విపక్షాలు, ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టేలా పనిచేయాలన్నారు. సమావేశంలో సచివాలయ కన్వీనర్ వడ్డె రమణ, మున్సిపాలిటి వైస్ చైర్మన్లు మర్రి రవి, సుమియా, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి కృష్ణారావు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్ దండు చంద్రలీలా గోపి, కార్పొరేషన్ల స్టేట్ డైరక్టర్లు దాసరి చిదానంద గౌడ్, గుల్జార్ బాష, బీసీ నేతలు ఈశ్వరయ్య, పసుపులేటి సుధాకర్, కువైట్ వైఎస్సార్‌సీపీ కన్వీనరు ముమ్మిడి బాలిరెడ్డి, మహిళా నేత మిరియాల సురేఖ, పార్టీ నాయకులు పోలి మురళీ, పాపినేని విశ్వనాథరెడ్డి, దళిత నేతలు దాసరి పెంచలయ్య, సత్యాల రామకృష్ణ, మున్సిపాలిటి కౌన్సిలర్లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కల్యాణం.. కమనీయం


టంగుటూరులో కైలాసనాథేశ్వర కల్యాణం దృశ్యం

నందలూరు (రాజంపేట): చెయ్యేటి పరీవాహక గ్రామమైన నందలూరు మండలం టంగుటూరులో వెలసిన పురాతన కామాక్షాంబ సమేత కైలాసనాథేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. దివంగత అవధానం సుబ్బనరసింహాశర్మ సోదరులు రాంప్రసాద్, రాజశేఖర్ శర్మ వారి కుమారులు అవధానం జయసింహాశర్మ, కుమారశర్మ, శిష్యబృందం ఆధ్వర్యంలో శివ,పార్వతుల కల్యాణోత్సవం వేడుకగా సాగింది. టంగుటూరు చెందిన చలమాల చిన్నబండెన్న అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం సాయంత్రం రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తుండడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాయచోటి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం, అనంతపురం గంగమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన ఎడ్లబండ లాగుడు పోటీలను ఎంపీపీ సుదర్శన్ రెడ్డితో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట నారాయణ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఎంపీటీసీ శంకర్ నాయుడు, రామాపురం ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్ సిపి నాయకులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

త్రేతేశ్వరస్వామి శివరాత్రి ఆదాయం రూ.16 లక్షలు


నగదును లెక్కిస్తున్న ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు

రాజంపేట రూరల్ : అత్తిరాలలోని శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు రూ.16,02,038 ఆదాయం వచ్చిందని దేవదాయ శాఖ అధికారి గంగవరం కొండారెడ్డి తెలియజేశారు. ఆలయ ప్రాంగణంలో ఆదాయాన్ని దేవదాయశాఖ మదనపల్లి సెక్షన్ ఆఫీసర్ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ టెంకాయల విక్రయ వేలం పాట ద్వారా రూ.6,70,000 వచ్చిందన్నారు. హుండీ లెక్కించడం ద్వారా రూ.3,52,945, దర్శన టికెట్‌ల వల్ల రూ.4,48,530 వచ్చిందని తెలియజేశారు. చదివింపుల రూపంలో రూ.1,30,563లను భక్తులు అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, ఆలయ పురోహితులు కె.పద్మనాభశాస్త్రి, జూనియర్ అసిస్టెంట్ పోలి సుదీష్‌రెడ్డి, రూరల్ హెడ్‌కానిస్టేబుల్ కేవీసుబ్బరాజు, ఉమెన్ కానిస్టేబుల్ ఎం.అమరావతి, ఆలయ సిబ్బంది వై.హరినాథ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాటం

రాయచోటి అర్బన్ : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో కమ్యూనిస్టు పార్టీ ప్రజాళిక ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు, మతోన్మాద విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు మండెం సుధీర్‌కుమార్, సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, వంగిమళ్ళ రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ కోటి, సుమిత్రమ్మ, పుల్లయ్య, వెంకటేశుతో పాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ..

స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని రోగులకు మంగళవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి కుమారుడు పుట్టిన రోజును పురస్కరించుకుని పంపిణీ కార్యక్రమం జరిగింది.

వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న పోచంరెడ్డి సుబ్బారెడ్డి

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న ఎం.వి. రామచంద్రారెడ్డిని గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక డైట్ పాఠశాలలో ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పిఎస్‌టియు) జిల్లా కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు సి.ఓబుల రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పోచంరెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అటు ప్రభుత్వానికి, ఇటు ఉపాధ్యాయవర్గానికి వారధిగా ఓర్పు, నేర్పు, సహనంతో అన్ని యాజమాన్యాల ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను పరిష్కరించే ఏకైక వ్యక్తి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులంతా గుర్తెరిగి తమ మొదటి ప్రాధాన్యత ఓటును రామచంద్రారెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్రగౌరవ అధ్యక్షుడు చిన్న రెడ్డెన్న, రాష్ట్రఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, కార్యదర్శి మునిరెడ్డి, మైనార్టీ కన్వీనర్ మజహరుల్ హఖ్, కడప జిల్లా అధ్య క్ష, కార్యదర్శులు పి.వి.సుబ్బారెడ్డి, జక్రియబాబాష, రాయచోటి అధ్యక్షుడు హబీబుర్ రహిమాన్‌తో పాటు పలువురు సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి

ఓబులవారిపల్లె: తల్లిదండ్రుల సహకారంతో పదోతరగతి విద్యార్థులు బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు టీవీ రమణయ్య తెలిపారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో నైట్ విజన్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు నిర్వహించారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థుల ఇండ్లకు వెళ్ళి వారి తల్లిదండ్రులతో మాట్లాడి బాగా చదివించాలని, వారికి వేరే పనులు చెప్పకుండా చదువుపట్ల శ్రద్ధపెట్టే విధంగా చూడాలని సూచించారు. బాగా కష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని, ఇందుకు తల్లిదండ్రుల సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు చెంగా శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టండి


సిద్దవటం: హాజరైన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

సిద్దవటం: ప్రతి పక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను వైఎస్ఆర్‌సీపీ సైనికులు తిప్పి కొట్టాలని వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు అన్నారు. సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ శివారులో ఉన్న శ్రీ కనకదుర్గ కళ్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం సిద్దవటం మండలం గ్రామ సచివాలయాల కన్వీనర్‌లకు, వాలంటీర్లకు, గృహ సారథులకు మా నమ్మకం నువ్వే జగన్, గృహ సారథుల శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ వైఎస్ఆర్ సువర్ణపాలన అందించారని, అదే తరహాలో సీఎం వైఎస్ జగన్ పాలన అందజేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థతో లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారన్నారు. రాష్ట్రంలో మరోసారి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ప్రతి పక్షాల గుండెల్లో భయం పట్టుకుందన్నారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సచివాలయాల కన్వీనర్‌లు, వాలంటీర్లు, గృహ సారథుల పనితీరు వలన ప్రజల్లో చైతన్యం కలిగేలా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం మండల జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డికి వారు ప్రచార కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా పరిశీలకులు క్రిష్ణమూర్తి, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ వెంకటమ్మ, జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జ్యోతి జగదీష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మీదేవి, మండల ఉపాధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి, మల్లేశ్వరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ఏకుల రాజేశ్వరిరెడ్డి, జవహర్‌బాష, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వి. సుబ్బయ్య, రైతు విభాగం మండల కన్వీనర్ పల్లె సుబ్బరామిరెడ్డి, యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌లు గోపాలస్వామి, వెంకటసుబ్బారెడ్డి, పార్టీ ప్రతినిధి ఉపాసి వెంకటరమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

సంబేపల్లె : సంబేపల్లె మండల కేంద్రంలో బుధవారం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమం ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. మండల కేంద్రంలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వాలంటీర్లు, నాయకులు హాజరుకావాలన్నారు.

■ వేడుకగా పూలంగిసేవ


సూర్యప్రభపై ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు


పూల పాన్పుపై శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామి వారికి పూలంగి సేవ చేశారు. రాత్రి 9గంటల నుంచి సుమారు అర్ధరాత్రి పూర్తయ్యే వరకు స్వామి వారిని తమిళనాడు, కర్నాటక, ఇతరా రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు. ఈ పూలంగి సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డీవి రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతి, ఆలయ ప్రధాన అర్చకులతో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు

శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ భద్రకాళీ సమేతుడు సూర్యప్రభ వాహనంపై ఊరేగారు. స్వామివారు ఆలయం నుంచి మార్కెట్ వీధి, గాంధిబజారు, కంసల వీధి, బ్రాహ్మణ వీధుల గుండా ఊరేగుతూ తిరిగి ఆలయ మాడవీధులలో ఊరేగారు. స్వామి వారికి అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

బీసీల అభ్యున్నతే వైఎస్సార్ సీపీ లక్ష్యం


నియామక పత్రాలు అందజేస్తున్న షేక్ నిజాముద్దీన్

గాలివీడు : బీసీల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని అన్నమయ్య జిల్లా, బీసీ సంఘం అధ్యక్షులు సి మల్లికార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం గాలివీడు మండల కేంద్రంలోని స్థానిక ఎస్‌కే ఫంక్షన్ హాల్‌లో జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లా సంయుక్త కార్యదర్శిగా బుక్కపటనం విష్ణువర్ధన్, జిల్లా కార్యదర్శిగా నవాజ్ అలీ, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడిగా షేక్ షమీరుల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే రాజంపేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పులుగురు అశోక్ కుమార్, గాలివీడు మండల బీసీ సంఘం అధ్యక్షులుగా బి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా చిన్నకోట్ల సురేష్, కార్యదర్శిగా లక్ష్మయ్యలను ఎన్నుకున్నారు. ఎంపికైన వారందరికీ మైనార్టీ యువ నాయకులు షేక్ నిజాముద్దీన్ చేతులు మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి నియోజకవర్గ అధ్యక్షులు అమీర్ బాష, మండల బీసీ నాయకులు మడితం రెడ్డి కుమార్, అవులకుంట శ్రీకాంత్, పండు కిషోర్, జావిద్ భాయ్, వినోద్ దేవశేఖర్, చిన్నకోట్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర


చాగలగుట్టపల్లె గంగమ్మ దేవత ఉత్సవ విగ్రహ మూర్తి


అమ్మవారిని పోలీసు బందోబస్తు నడుమ ఊరేగింపుగా తీసుకువస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

లక్కిరెడ్డిపల్లె : రాయలసీమ జిల్లాల్లోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ దేవత జాతర అత్యంత వేడుకగా సాగింది. మంగళవారం గంగ జాతరను పురస్కరించుకొని సీమ జిల్లాలతో పాటు కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. దారులన్నీ అమ్మవారి సన్నిధికే అన్నట్లు వేలాది వాహనాలు జాతర వైపు సాగాయి. సంతానం ప్రసాదించాలని గంగమ్మ దేవత చెంత మహిళా భక్తులు ఒరపడి ప్రార్థించారు. ఒరపడిన మహిళలకు శిద్దుల ప్రసాదాన్ని అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించి కొబ్బరికాయలు కొట్టారు. జాతర సందర్భంగా రంగు రంగుల పూలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారి పుట్టినిల్లు అయిన చాగలగుట్టపల్లెలో సోమవారం రాత్రి నుండి జాగారాం వైభవంగా కొనసాగింది. అమ్మవారి జాగారం రోజున చాగలగుట్టపల్లెలో ఆర్కెస్ట్రా ఏర్పాటు చేయడంతో భక్తులు ఉత్సాహంగా పాల్గొని తిలకించారు. లక్కిరెడ్డిపల్లె సి.ఐ.వరప్రసాద్, గాలివీడు ఎస్ఐ తన సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

■ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి అమ్మవారికి చాగలగుట్టపల్లెలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాగలగుట్టపల్లె అమ్మవారిని తీసుకెళ్లే మార్గంలో దారి పొడవునా బాణా సంచా పేలుస్తూ సందడి చేశారు. డప్పు వాయిద్యాల నడుమ గంగమ్మ దేవత ఉత్సవ మూర్తిని వెండి పల్లకిలో సాంప్రదాయ బద్ధంగా నిర్వాహకులు తెల్లవారుజామున 3 గంటలకే అప్పలరాజుగారిపల్లె మీదుగా మర్రిచెట్టు మార్గాన జాతరకు చేర్చారు. చాగలగుట్టపల్లె నుండి జాతర స్థలం వరకు అడుగడుగునా బోనాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం

అనంతపురం గంగమ్మ దేవతను దాతల సహకారంతో ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామునే అమ్మవారికి ఆలయ పూజారులు ఆదిమూలం చంద్ర, రెడ్డి శేఖర, గంగయ్య, గంగరాజు కుటుంబ సభ్యులు అభిషేకాలు, అర్చనలు చేసి అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఆలయ కమిటీ చైర్మెన్ నరసింహ్మా రెడ్డి, ఆలయ ఈఓ రవీంద్రరాజు, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, ఆలయ సిబ్బంది గంగ జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకర్షణగా నిలిచిన కుంకుమ, చాందినీ బండ్లు

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు జాతరకు చేరుకోవడంతో చాందినీ బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాదిగా కాలినడకన జాతరకు తరలివచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. చాందినీ బండ్లతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరింపజేశాయి. జబర్దస్, రేలారె రేలా, చెక్క భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.


సంతానం కోసం వరపడిన మహిళలు

గట్టి బందోబస్తు..

అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శనాన్ని కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ఎక్కడికక్కడ చెక్ పోస్టులను ఏర్పాటు చేసి చాందినీ బండ్లను మాత్రమే లోనికి అనుమతించారు.

భారీ కొనుగోళ్లు:

భక్తులు తమకు అవసరమైన పనిముట్లను కొనుగోలు చేశారు. రూ.లక్షల్లో వ్యాపారాలు కొనసాగాయి. వందలాదిగా చెరుకుల బండ్లు తరలిరావడంతో చెరుకుల గెడెలు అధిక రేట్లకు అమ్ముకున్నారు.

■ వేసవి దృష్ట్యా దాతలు ముందుకు వచ్చి మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

గంజాయి స్వాధీనం

ఒంటిమిట్ట: మండల పరిధిలోని నరవకాటిపల్లి పంచాయతీ, రైల్వే కాలనీకి చెందిన లేపాకు నాగమ్మ తన స్వగృహంలో అక్రమంగా నిల్వచేసి విక్రయిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు మంగళవారం ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు..తమకు వచ్చిన సమాచారం మేరకు లేపాకు నాగమ్మ ఇంట్లో సోదా చేయగా గంజాయి బయట పడిందని, గంజాయి స్వాధీనం చేసుకుని నాగమ్మను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఘన సన్మానం


తెలుగు ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న ఎస్టీయూ నాయకుడు రామకృష్ణ

పెనగలూరు: మాతృ భాష దినోత్సవం సందర్భంగా కొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు చిన్న వెంకట సుబ్బయ్యను మంగళవారం ఎస్టీయూ రాష్ట్ర నాయకులు పిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాషను మరువరాదని అన్నారు. దేశభాషలందు తెలుగు లెస్స అని వారు మరొక్కసారి గుర్తు చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయచంద్రా రెడ్డి, ప్రశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.